నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
గురువారం డిసెంబర్ 19, 2024 www.navatelangana.com

క్రీడా పోటీలలో రాష్ట్ర స్థాయికి ఎంపిక

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లి గ్రామానికి చెందిన రమ్య సీఎం కప్ క్రీడలలో భాగంగా జిల్లాస్థాయిలో నిర్వహించిన మహిళా సీనియర్ విభాగంలో 400 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్ లలో గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్రస్థాయి పోటీలలో ఎంపికైంది. కాగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి ఆమెను ఘనంగా సత్కరించారు. రాష్ట్రస్థాయిలో, జాతీయ స్థాయిలో రాణించి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరసింహ యాదవ్, గ్రామ యూత్ అధ్యక్షులు బాబు, రామస్వామి, బాలయ్య, కార్తీక్, తదితరులు ఉన్నారు.


క్రీడాకారిని రమ్యకు సన్మానం.. ఫ్రేమ్ అందజేత

నేడు జిల్లాకు ఆశాల బస్సుయాత్ర

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఫిక్స్ వేతనం రూ.18 వేలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న ఆశాల బస్సు యాత్ర నేడు(గురువారం) జిల్లా కేంద్రానికి చేరుకోనుందని, కావున ఆశా వర్కర్‌లు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పిలుపునిచ్చారు. బుధవారం సిఐటియు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆశా వర్కర్ల సమస్యలపైన జరుగుతున్న రాష్ట్ర బస్సు జాత నేడు నిజామాబాద్ జిల్లాకు రానున్నదని తెలిపారు. జిల్లా పరిషత్ నుంచి భారీ ప్రదర్శన ర్యాలీ నిర్మల హృదయ స్కూల్ మీదుగా సిఐటియు కార్యాలయనికి చేరుకుంటుందన్నారు. అనంతరం బహిరంగ సభ ఉంటుంది. ఆశా వర్కర్లందరూ జిల్లాలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సుకన్య, సారా, రేవతి, హసీనా, పర్వీన్, స్వప్న, సరిత, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నూర్జహాన్


చెట్టుపై నుంచి దూకిన కీసరి గంగాధర్

పోలీస్‌స్టేషన్‌లో చెట్టుపై నుంచి దూకిన యువకుడు

- డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడటంతో జరిమానా విధించొద్దని ఆత్మహత్యాయత్నం
- తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

నవతెలంగాణ-తాడ్వాయి

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ యువకుడు.. తనకు జరిమానా విధించొద్దని వేడుకుంటూ పోలీస్‌స్టేషన్ ఆవరణలో చెట్టుపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేశాడు. తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్‌లో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన కీసరి గంగాధర్ యువకుడు తన ఇంటికి చుట్టపు చూపుగా వచ్చిన గంగాధర్‌తో మద్యం షాప్‌నకు వెళ్లి మద్యం సేవించి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో దేనికలాన్ చౌరస్తాలో డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టిన పోలీసులు.. వీరిని కీసరి గంగాధర్ బైక్‌ను ఆపి డ్రంకెన్‌డ్రైవ్ టెస్టు చేయగా.. మద్యం సేవించినట్టు వచ్చింది. కాగా తనకు జరిమానా విధించొద్దని యువకుడు పోలీసులను బతిమిలాడుతూ కాళ్లు మొక్కాడు. పోలీసులు బైక్‌ను స్టేషన్‌కు తరలించారు. విసుగ చెంది కీసర గంగాధర్ స్టేషన్ ఆవరణలో ఉన్న చెట్టుపై ఎక్కి దూకాడు. తీవ్ర గాయాలు కాగా 108 లో చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిసింది. యువకుడికి భార్య రాజమణి, కూతురు, కుమారుడు ఉన్నారు.

అధికారుల నిర్లక్ష్యం..

సోయా రైతుకు తీవ్ర నష్టం

- తూకం వేసి తరలించిన సోయా.. తిరిగి వెనక్కి
- మట్టి ఉందని, రంగు మారిందని తిప్పి పంపుతున్న వైనం
- చిల్లర్గి విండో సిబ్బందిపై రైతుల మండిపాటు
- ముందే చెప్తే ప్రయివేటులో విక్రయించుకునేవారమని వాపోత

నవతెలంగాణ-పిట్లం

అనేక వ్యయ ప్రయాసాలకోర్చి పంట పండించి మార్కెట్‌కు తీసుకొస్తే.. తూకం వేసి తరలించి తిరిగి వెనక్కి పంపిస్తుండటంతో రైతుల వేదన అరణ్య రోదన అవుతుంది. అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు తీవ్ర నష్టాన్ని మిగులుస్తుంది. సోయా పంట కొనుగోలు జరుగుతున్నా.. తూకం వేసి గోదామ్‌లకు తరలించిన పంట తిరిగి వస్తుండటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారుల తీరుపై తీవ్రంగా మండిపడుతున్నారు. ముందే చెబితే ప్రయివేటు వ్యాపారులకైనా విక్రయించుకునే వాళ్లమని వాపోతున్నారు. పంట తరలించిన కొన్ని రోజుల తర్వాత మట్టి ఉందని, రంగు మారిందనే కారణాలు చెబుతున్నారని, తిరిగి వచ్చిన పంటను ఎవరు కొనుగోలు చేస్తారని ప్రశ్నిస్తున్నారు.

మండలంలోని తిమ్మానగర్, పిట్లం, అల్లాపూర్, భూర్నాపూర్, గోద్మేగావ్, కారేగావ్, కంబాపూర్ గ్రామాల రైతులు సోయా పంటను సాగు చేశారు. సింగిల్ విండో సొసైటీల ఆధ్వర్యంలో సోయా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ మద్దతు ధర 4892 రూపాయలతో కొనుగోలు చేపట్టా రు. మండల వ్యాప్తంగా సుమారు 10 వేల బస్తాల సోయా పంటను కొనుగోలు చేపట్టి సుమారుగా నెలరోజుల వ్యవధి అవుతున్నప్పటికీ కొనుగోలు చేపట్టిన సోయా బస్తాలలో మట్టి, కలర్ మారడం, పచ్చ అవడం పేరిట అధికారులు సుమారుగా 200 సోయా బస్తాలను తిరిగి పంపడం ఏమిటని రైతులు ఆందోళన వ్యక్తపరిచారు.

సోయపంట కొనుగోలు చేపట్టిన సమయంలో సింగిల్ విండో సిబ్బంది ఎలా కొనుగోలు చేశారని, ఆ సమయంలోనే కొనుగోలు చేయకున్నా దళారులకు విక్రయించుకునే వారమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తిరిగి పంపిన సోయా బస్తాలను ఇప్పటికిప్పుడే ఎవరు కొంటారని ప్రశ్నిస్తున్నారు.

ఈ తరహాలోనే పిట్లం సింగిల్ విండో పరిధిలో ధాన్యము కొనుగోలులో ఇష్టరాజ్యంగా సీరియల్ నంబర్లు కేటాయించడంలో ముందు తీసుకొచ్చిన ధాన్యం రైతులకు నష్టపరిచారు. హస్నాపూర్ గ్రామానికి చెందిన రైతు ఒక 142 బస్తాల ధాన్యం విక్రయించగా కేవలం 42 బస్తాలనే రికార్డులో చూయించగా కంగుతిన్న రైతు సొసైటీ అధికారులను నిలదీయ డంతో పంపినటు వంటి లోడు రైతుల బస్తాల లెక్కించడంతో వాస్తవం బయటపడింది. సింగిల్ విండో సిబ్బంది తీరుపై రైతులు మండిపడుతున్నారు.


చిల్లర్గి సొసైటీకి తిరిగి వచ్చిన సోయా పంట బస్తాలను పరిశీలిస్తున్న సొసైటీ కార్యదర్శి, రైతులు

జాగ్రత్త వహించాం..
సింగిల్ విండో కార్యదర్శి సంతోష్‌రెడ్డి

చిల్లేర్గి సింగిల్ విండో పరిధిలోని మండల మార్కెట్ కమిటీలో ఏర్పాటుచేసిన సోయా కొనుగోలు కేంద్రంలో సోయా పంటలో మట్టి, రంగు మారడం, పచ్చ అయిందని రైతులకు తెలిపాం. అధికారులు తిరిగి సోయా బస్తాలను వెనక్కి పంపితే మీరే బాధ్యత వహించవలసి ఉందని ముందే తెలిపట్టు విండో కార్యదర్శి సంతోష్‌రెడ్డి తెలిపారు.

స్కాలర్‌షిప్. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేసి నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

విద్యార్థుల స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై తెలంగాణ పిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ స్పందించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ పిలుపులో భాగంగా స్థానిక ఎన్టీఆర్ చౌరస్తా వద్ద దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేష్ మాట్లాడుతూ.. ఈ జిల్లాకు సంబంధించిన రూ.180 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్‌లను విడుదలపై ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ స్పందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని వారికి ఆత్మహత్యలు శరణ్యమా అన్నట్టుగా ప్రభుత్వం వ్యవహరించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఫీజు బకాయిలను విడుదల చేస్తామని హామీ ఇచ్చిన ఇప్పటివరకు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ రాష్ట్రంలో లిక్కర్‌కి మంత్రి ఉండొచ్చుగాని సమాజాన్ని మార్చే విద్యా వ్యవస్థకు మాత్రం మంత్రి లేకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఎమ్మెల్సీ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు చక్రి, రాజు, వినీత్, సుజిత్, సుశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు

రూ.10 వేల వేతనం అమలు చేయాలి

- మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్
- సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన దీక్ష

నవతెలంగాణ-కామారెడ్డి

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మధ్యాహ్న భోజన కార్మికులకు 10,000 రూపాయలు ఇస్తానన్న హామీని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం(సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న గౌరవేతనం, గుడ్ల బిల్లు వెంటనే విడుదల చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చే గౌరవ వేతనం, కార్మికులకు నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి ప్రభుత్వానికి ఎదురు పెట్టుబడి పెట్టి వంట చేసి పెడుతున్నారన్నారు. తెచ్చిన అప్పులు కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గతంలో చేసిన వాటికి బిల్లు రాలేదని, పైగా రాగి జావా పోయించారని, బిల్లు రాకపోయినా పిల్లలకు వండి పెట్టాలని అధికారులు మధ్యాహ్న భోజన కార్మికులను ఒత్తిడి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల విషయంలో జోక్యం చేసుకోని, పెరిగిన ధరలకు అనుకూలంగా ధరలు పెంచాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న గుడ్ల బిల్లు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రాజనర్సు, మధ్యాహ్న భోజన జిల్లా నాయకులు కృష్ణ గౌడ్, వెంకటేష్, మధ్యాహ్న భోజన యూనియన్ నాయకులు సర్వసతి, సోమలింగ, సరస్వతి, వనజ, దుర్గయ్య, రాజమణి, ప్రభు, శ్రీనివాస్, భాస్కర్, షబ్బీర్, రామచంద్రం, కాశిరామ్ పాల్గొన్నారు.



నిరసన దీక్షలో మధ్యాహ్న భోజన కార్మికులు, సీఐటీయూ నాయకులు

టీఎఫ్‌డీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన దిల్‌రాజు

శుభాకాంక్షలు తెలియజేసిన పలువురు


బాధ్యతలు స్వీకరించిన దిల్‌రాజు

నవతెలంగాణ-మోపాల్

నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామానికి చెందిన సినీ నిర్మాత దిల్ రాజు తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఈ అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బాధ్యతల స్వీకారోత్సవంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ అంత రెడ్డి రాజిరెడ్డి, ఇందూరు తిరుమల దేవాలయ ధర్మకర్త నరసింహారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షల వెల్లువ

సదాశివనగర్/రామారెడ్డి : తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన దిల్ రాజును కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్, పార్టీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి సుభాశ్‌రెడ్డి, రామారెడ్డి మాజీ జెడ్పీటీసి నా రెడ్డి మోహన్‌రెడ్డి తదితరులు కలిశారు.


శుభాకాంక్షలు తెలియజేస్తున్న పలువురు

అభివృద్ధిపై దృష్టిసారించు

నవతెలంగాణ-కామారెడ్డి(బీబీపేట్)

'తాను తినే అన్నంలో రాయి తీయని వాడు ఏట్లో రాయి తీయడానికి ఎగబడ్డట్టుగా' కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తీరు ఉందని కాంగ్రెస్ పార్టీ బీబీపేట్ మండల అధ్యక్షుడు సుతారి రమేష్ అన్నారు. కామారెడ్డిలో మోర్లు నిండి ప్రజలు రోగాల బారిన పడుతుంటే ఆ విషయంపై మాట్లాడవలసిన ఎమ్మెల్యే హైదరాబాద్ మూసి మీద పోరాటం చేస్తుండన్నారు. ముందు కామారెడ్డి నియోజకవర్గం అభివృద్ధి మీద దృష్టిసారించాలని హితవు పలికారు. బుధవారం బీబీపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. అధికార పార్టీకి అమ్ముడుపోయే నైజం గల వ్యక్తివి నీవు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ బీఫామ్ ఇస్తే ఆరు కోట్లకు బీఆర్ఎస్ కు అమ్ముకున్నావు అని ఆరోపించారు. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరుతానని డబ్బులకు బేరం మొదలు పెట్టావు కాంగ్రెస్ పార్టీ నిరాకరిస్తే అసెంబ్లీలో ఎదురుదాడికి దిగుతున్నావ్ అని, కామారెడ్డి రోడ్ లు వెడల్పు చేస్తానని అక్రమ కట్టడాలు కులుస్తానని ఎన్నికల్లో చెప్పిన నీవు ఎన్ని రోడ్లు వెడల్పు చేశావు ఎన్ని అక్రమ కట్టడాలను కూల్చావో ఒక్కసారి ఆలోచన చేయాలన్నారు. అభివృద్ధి చేతకాకపోతే మా నాయకునితో కలిసి రా కామారెడ్డి అభివృద్ధికి సహకరించు అన్నారు. ఈ కార్యక్రమంలో బిక్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజు, మాజీ ఎంపిటిసి బుమ గౌడ్, సత్యం, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ముహూర్తం ఫిక్స్

- ఈ నెల 22న మాతా శిశుసంరక్షణ కేంద్రం, క్రిటికల్ కేర్ సెంటర్ ప్రారంభం
- ఆరు నెలల క్రితమే పూర్తయిన భవనం
- మంత్రులకు సమయం లేకపోవడంతోనే ఆలస్యం..?

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో, బస్టాండ్ ఎదురుగా ట నిర్మించిన మాతా శిశుసంరక్షణా కేంద్రం, క్రిటికల్ కేర్ భవన ప్రారంభోత్స వానికి ఎట్టకేలకు ముహూర్తం ఫిక్స్ అయింది. ఈ నెల 22న జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణరావు, వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతులు మీదుగా ప్రారంభోత్సవం చేయనున్నట్టు అధికారుల నుంచి సమాచారం. కాగా భవనం పూర్తయి ఆరు నెలవుతున్నా ఇప్పటి వరకు ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. మంత్రులకు సమయం లేకపోవడంతోనే ఆలస్యం జరిగినట్టు భోగట్ట. జిల్లాకు రెగ్యూలర్ మంత్రి ఉంటే సమస్య వచ్చేది కాదనే చర్చలు వినిపిస్తున్నాయి.

మాతా శిశుసంరక్షణ కేంద్రం కోసం 2017 వరకు రెండు అంతస్తులతో భవనం నిర్మించారు. తదనంతరం 2019 సంవత్సరంలో 23.75 కోట్లతో మూడవ, నాలుగవ అంతస్తుల నిర్మాణ పనులు ప్రారంభించారు. అందులోను నాలుగు ఫ్లోర్లలో పూర్తిగా మాతా శిశుసంరక్ష కేంద్రంతో పాటు క్రిటికల్ కేర్ సౌకర్యాలు కూడా ఇదే భవనంలో వైద్యం అందించుటకు, భవనాన్ని అన్ని సౌకర్యాలతో ఈ ఏడాది జూన్ నాటికి పనులు పూర్తి చేశారు. కాగా నేటికీ 6 నెలలు కావస్తున్న ప్రారంభానికి నోచుకోలేదు.

ఆరా తీస్తే.. మంత్రులకు సమయం లేకపోవడంతో ఆలస్యమవుతున్నట్టు సమాచారం. జిల్లాకు రెగ్యూలర్ మంత్రి ఉంటే అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు ఆటంకం ఉండేది కాదని, ప్రస్తుతం లేకపోవడంతో ఇన్‌చార్జి మంత్రి సమయం కోసం వేచి చూడాల్సి వస్తుంది. ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రిగా ఉన్న జూపల్లి కృష్ణరావు.. తన శాఖల పనితీరుతో నిత్యం బిజీగా ఉంటున్నారు. జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా ఆయననే ఉండటంతో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు ఆలస్యమవుతున్నట్టు వినికిడి. కాగా తాజాగా తేదీ ఖరారు కావడంతో అన్ని సవ్యంగా జరిగితే ఈ నెల 22న మాతా శిశు సంరక్షణ కేంద్రం, క్రిటికల్ కేర్ సెంటర్ భవనం ప్రారంభోత్సవం చేసుకోనుంది.


ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న భవనం

తప్పులు లేకుండా..

త్వరగతిన ఇండ్ల సర్వే పూర్తి చేయాలి

- సర్వేతీరు పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- పలు గ్రామాలు అడిషనల్ కలెక్టర్‌లు

నవతెలంగాణ-రామారెడ్డి/భిక్కనూర్/తాడ్వాయి

ఇందిరమ్మ ఇండ్ల సర్వే తప్పులు లేకుండా, త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మండలంలోని పోసానిపేట లో బుధవారం ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలిం చారు. సర్వేలో సమస్యలు, ప్రజల సహకారం పై ఆరా తీశారు. కార్యక్రమంలో తహసిల్దార్ సువర్ణ, ఎంపీడీవో తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే పరిశీలిలన

భిక్కనూర్ : ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పగడ్బందీగా ఎలాంటి తప్పులు లేకుండా యాప్‌లో నమోదు చేయాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండలం లోని బస్వాపూర్ గ్రామంలో ఇండ్ల సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో డిఎల్పిఓ శ్రీనివాస్, ఎంపీడీవో రాజ్ కిరణ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి దయాకర్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.


రామారెడ్డి : పోసానిపేట్‌లో

తాడ్వాయి : ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతంగా చేపట్టాలని అడిషనల్‌కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆయన బుధవారం మండల కేంద్రంలోని దళిత కాలనీలో చేపడుతున్న సర్వేను పరిశీలించి మాట్లాడారు. ప్రజా పాలనలో చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి పక్కగా కుటుంబ వివరాలు నమోదు చేయాల న్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి రాజారాం మండల అభివృద్ధి అధికారి సయ్యద్ సాజిద్ అలీ ఎంపీఓ సవిత రెడ్డి, పంచాయతీ కార్యదర్శి బాలు పాల్గొన్నారు.


తాడ్వాయిలో పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

రాష్ట్రస్థాయి సిఎం కప్ బేస్‌బాల్ పోటీలకు కోటాల శ్రీకర్ ఎంపిక



నవతెలంగాణ-డిచ్‌పల్లి

రాష్ట్రస్థాయి సిఎం కప్ బేస్ బాల్ పోటీలకు ఇందల్‌వాయి గ్రామానికి చెందిన కోటాల శ్రీకర్ ఎంపికైనట్లు బేస్‌బాల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, సొప్పారి వినోద్ తెలిపారు. బుధవారం నుంచి శనివారం వరకు మూడు రోజుల పాటు హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ బేస్‌బాల్ పోటీలకు ఇందల్‌వాయి గ్రామానికి చెందిన కొటాల శ్రీకర్ పాల్గొననున్నట్లు బేస్‌బాల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, సొప్పారి వినోద్ వివరించారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం సీఈసీ విభాగంలో చదువుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ కార్యదర్శి మర్కంటి గంగామోహన్, పిడి కొటాల సంజీవ్, కోచ్ నరేష్ పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడం అభినందనీయం



కరస్పాండెంట్‌ను సన్మానించిన అయ్యప్ప స్వాములు

నవతెలంగాణ-ఆర్మూర్

విద్యార్థులను క్రమశిక్షణతో ఉన్నతులుగా తీర్చిదిద్దడం అభినందనీయమని అయ్యప్ప మాలదారులు అన్నారు. పట్టణంలోని మామిడిపల్లి నలంద పాఠశాల యజమాన్యం చదువుతో పాటు ఆటపాటలలో ముందు ఉంచడం అభినందనీయమని, పాఠశాల కరస్పాండెంట్ లక్కారం రాజేంద్రప్రసాద్‌ను బుధవారం సన్మానించారు. ప్రిన్సిపాల్ సాగర్, ఉపాధ్యాయ బృందం ప్రత్యేక శ్రద్ధ చూపుతూ విద్యా బోధన చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో లిల్లీపుట్ పాఠశాల ప్రిన్సిపాల్ దాస్, కరస్పాండెంట్ రామకృష్ణ, అయ్యప్ప మాలదారులు పాల్గొన్నారు.

ఆరోటౌన్ పరిధిలో చోరీ

- పది తులాల బంగారం, నగదు ఎత్తుకెళ్లిన గుర్తు తెలియని దుండగులు



చోరీ అయిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీ జరిగింది. ఇండియన్ గెస్ట్ హౌస్ సమీపంలోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన దుండగులు 10 తులాల బంగారు ఆభరణాలతోపాటు నగదును ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్స్‌లెన్సీ అవార్డుకు ఎంపికైన బోర్గం(పి) పాఠశాల

నవతెలంగాణ-మోపాల్

హైబిజ్ టీవి ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్సీ అవార్డు 2024కు మండలంలోని బోర్గం (పి) జిల్లా పరిషత్ పాఠశాలను ఎంపిక చేసినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్ తెలిపారు. జిల్లాలో అత్యధిక విద్యార్థులు చదువుతున్న ఏకైక పాఠశాల బోర్గం పాఠశాల అని తెలిపారు. అలాగే విద్య, సాంస్కృతిక కార్యక్రమాలు సక్రమంగా నిర్వహిస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలలో దాదాపు 923 మంది విద్యార్థులు చదవడం గొప్ప విషయమని తెలిపారు. ఇటువంటి అవార్డును ఒక మంచి స్వచ్ఛంద సంస్థ ఇవ్వడం చాలా సంతోషకరమని ప్రధానోపాధ్యాయులు శంకర్ తెలిపారు. ఈ అవార్డును ఈ నెల 23న పాఠశాలకు అందిస్తారని ప్రధానోపాధ్యాయులు శంకర్ పేర్కొన్నారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో చౌట్‌పల్లి విద్యార్థిని ప్రతిభ



అవార్డును అందుకుంటున్న విద్యార్థినిని

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

జిల్లాస్థాయిలో జరిగిన బయోలాజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో మండలంలోని చౌట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని సబా సాదియా ఉత్తమ ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానాన్ని పొందినట్లు మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నేర ఆంధ్రయ్య తెలిపారు. జిల్లాస్థాయి బయాలజికల్ సైన్స్ టాలెంట్ టెస్టులో విద్యార్థిని సబా సాదియా ద్వితీయస్థానం సాధించి జిల్లా విద్యాధికారి అశోక్ చేతుల మీదుగా అవార్డుతో పాటు రూ.1000 ప్రైజ్‌మనీ అందుకున్నట్లు ఎంఈవో తెలిపారు. ఇప్పటివరకు మండల స్థాయిలో నిర్వహించిన ప్రతి టాలెంట్ టెస్టుల్లో కూడా ప్రతి సబ్జెక్టులో సబా సాదియా మండల టాపర్‌గా నిలిచినట్లు తెలిపారు. మాథ్స్‌లో కూడా జిల్లా స్థాయిలో తృతీయస్థానం సాధించినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు మగ్గిడి నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

దిల్‌రాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నియోజకవర్గ ఇన్చార్జ్



దిల్‌రాజ్‌ను సన్మానిస్తున్న వినయ్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా దిల్‌రాజు (టీఎఫ్‌డీసీ) చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న శుభ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా పూలమాలలతో సన్మానించారు.

ప్రాథమిక పాఠశాలకు 15 డ్యూయల్ డెస్క్‌ల వితరణ



పాఠశాలకు డెస్క్ బెంచీలు అందజేత

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు నేలపై కూర్చుండి విద్యను అభ్యసిస్తుండగా.. ఈ విషయం తెలుసుకున్న వసంత టూల్స్ అధినేత దయానంద్‌రెడ్డి తన బాల్య మిత్రుడు నాగేశ్వరరావు సహకారంతో పాఠశాలకు 15 డ్యూయల్ డెస్క్‌లను అందజేసినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరామ్ పేర్కొన్నారు. తమ పాఠశాల విద్యార్థులకు సహాయ సహకారాలను అందించిన దయానందరెడ్డి, నాగేశ్వరరావు, జలంధర్‌గౌడ్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి కట్టా ఆంజనేయులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఈ శంకర్, పిఆర్టియు మండల అధ్యక్ష కార్యదర్శులు టి.సోమలింగంగౌడ్, కిషోర్, ఉపాధ్యాయులు ఆనంద్, లింగన్న, యూత్ అధ్యక్షులు సద్దాం, సుధాకర్, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అటవీ భూమి కబ్జా కాకుండా చూడాలి

- ప్రజలు అటవీ అధికారులకు సహకరించాలి
- రేంజ్ అధికారి రవి మోహన్ భట్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోకుండా, అటవీ భూములను కబ్జా కాకుండా ప్రతి నిత్యం పర్యవేక్షించే విధంగా చూడాలని రేంజ్ అధికారి రవి మోహన్ భట్ అన్నారు. బుధవారం ఇందల్‌వాయి ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో సెక్షన్, బీట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో వచ్చే ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని అటవీ ప్రాంతంలోని రహదారికి ఇరువైపులా రాకపోకలు సాగించే సమయంలో కొందరు వాహనదారులు, ఇతరులు బీడిలు, సిగరెట్లు తాగి అగ్గి ఆర్పకముందే ఎక్కడపడితే అక్కడ పడేస్తుంటారని,



మాట్లాడుతున్న రేంజ్ అధికారి రవి మోహన్ భట్

ఇంకొందరు బీడీ ఆకు కోసం కావాలనే అగ్గి పెడ్తారని అలాంటి వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. ఎక్కడైనా ప్రమాదవశాత్తు అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకున్నా రేంజ్ కార్యాలయంలో అందుబాటులో ఉన్న ఫైర్ బ్లోవర్‌తో మంటలను ఆర్పాలని సూచించారు. అటవీ భూములు కబ్జా కాకుండా చుడాలని పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక, మొరం తరలిస్తే అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అటవీ ప్రాంతంలో ఉన్న జంతువులను, పక్షులను వేటాడటం నేరమని, ప్రజలు అటవీ శాఖ అధికారులకు సహాయ సహకారాలు అందజేస్తూ అటవీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ రేంజ్ అధికారులు తూకరం రాథోడ్, సెక్షన్ అధికారులు అతిఖ్, రాజేశ్వర్, బగిలి శ్రీకాంత్, రేంజ్ పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన సెక్షన్, బీట్ అధికారులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పరికరాలు అత్యవసరం

- ఉచితంగా అందచేయడం అభినందనీయం
- ట్రామా కేర్ కోసం ప్రత్యేక కృషి
- ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ నారాయణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రోడ్డు ప్రమాద బారిన పడిన రోగులకు అత్యవసర చికిత్స గోల్డెన్ అవర్‌లో పరికరాలు ఎంతగానో ఉపయోగపడుతాయని, గోల్డెన్ అవర్‌లో చికిత్స తక్కువ సమయంలో అందినట్లయితే మరణం అవకాశం తక్కువగా ఉంటుందని, మానవతా దృక్పథంతో ఆలోచించి ఇలాంటి పరికరాలను ఆసుపత్రికి అందజేయడం అబినందనీయమని ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ నారాయణ పేర్కొన్నారు. బుధవారం ఇందల్‌వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అత్వంగ్ డిచ్‌పల్లి టోల్ వే ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.ఐదు లక్షల విలువైన పరికరాలను ఉచితంగా అందజేశారు. ఈ పరికరాలలో ఈసీజీ మిషన్ 5 పారామీటర్, ల్యాబ్ అనలైజర్ లాంటి పరికరాలున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఈ సంవత్సరం రోడ్డు ప్రమాదంలో మరణాల రేటు తగ్గిందని తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో జనాభాకు సరిపడా వాహనాల కంటే ఎక్కువ ఉన్నాయని దాదాపు నాలుగున్నర లక్షల పైచిలుకు వాహనాలు ఉన్నాయని, దీంతో రోడ్డు ప్రమాదాలు సైతం ఎక్కువగా జరిగే అవకాశం ఉందన్నారు. జాతీయ రాహదారి 44 రోడ్డు ప్రక్కన ఉన్న ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి



టోల్ వే ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పరికరాలు అందజేత

ఎళ్ళవేళలా అండగా ఉంటామని ఇంకా పరికరాలు అవసరమైతే ఇస్తామని తెలిపారు. కామరెడ్డి, నిజామాబాద్ జిల్లాల మధ్యలో ఇందల్‌వాయి ఉందని ఇక్కడ ట్రామా కేర్ సెంటర్ నెలకొల్పడానికి ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లినట్లు నారాయణ తెలిపారు. ఈ పరికరాలను రోడ్డు ప్రమాదంలో గాయాపడిన రోగులకు ఉపయోగించాలని టోల్ ప్లాజా ప్రాజెక్ట్ మేనేజర్ అనిల్ సింగ్, టోల్‌ప్లాజా మేనేజర్ చలపతిరావు అన్నారు. ఇంతకు ముందు లక్షల రూపాయల విలువైన వస్తువులు ఆసుపత్రికి అందజేసినట్టు తెలిపారు. డాక్టర్ తుకారం రాథోడ్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు వేచి ఉండు గది నిర్మాణం చేపట్టాలని ఆసుపత్రికి లక్షల రూపాయల విలువైన పరికరాలను ఉచితంగా అందజేయడంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. ప్లాజా మేనేజర్ వెంటనే స్పందించి తమవంతుగా ప్రయత్నిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఆర్డీప వర్మ, ఆపరేషన్ మేనేజర్ విరాజ్ దేశ్ పాండే,సెఫ్టి మేనేజర్ సతీష్, డాక్టర్ సుశాంత్‌రెడ్డి, కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ సంతోష్ కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్, ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్ అలీ, దేవపాల, టోల్‌ప్లాజా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జీపీ కార్మికుల అరెస్టు అన్యాయం

- ఇందుకు నిరసనగా అంబేద్కర్ విగ్రహానికి జేఏసీ వినతి



మాట్లాడుతున్న ఏజేసీ నాయకులు

నవతెలంగాణ-బోధన్

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 17న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడితే ప్రభుత్వం పోలీసుల ద్వారా అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు తెలిపారు. అరెస్టును నిరసిస్తూ బుధవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా కార్మిక సంఘాల జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. అనేక ఏండ్లుగా కార్మికులు కనీస వేతనాలు అందక, వారసత్వంగా గ్రామ పంచాయతీలకు బానిసలుగా పనిచేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్వతంత్ర భారతంలో రాజ్యాంగ కల్పించిన హక్కులు అడగటానికి కూడా ప్రభుత్వం అనుమతించకపోవటం అన్యాయమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన హక్కులు పరిష్కరించాలని, కనీస వేతనాలు ఇవ్వాలని అన్నారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద 5 లక్షల రూపాయలు ఇవ్వాలని, ఇన్సూరెన్స్ రూ.50 లక్షలు ఇవ్వాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కారోబార్, బిల్ కలెక్టర్లకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని అన్నారు. విద్యార్హతలకు తగిన విధంగా ప్రమోషన్స్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు సాగర్, టీయూసీఐ నాయకులు మల్లేష్, పోశెట్టి, విజయ్‌పటేల్, శివయ్య, బాబురావు, నాగనాథ్, శ్రీనివాస్, పాషా, చందు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గోల్డెన్ జూబ్లీ కళాశాలను తనిఖీ చేసిన డీఐఈవో

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ


జిల్లా కేంద్రంలోని గోల్డెన్ జూబ్లీ ప్రైవేటు జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపూడి రవికుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని తరగతి గదులను, పరిసరాలను పరిశీలించారు. తరగతి గదులు శుభ్రంగా ఉంచాలని, ఆవరణలో చెత్తచెదారం తొలగించాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. కళాశాల కార్యాలయం సిబ్బంది, కళాశాల యాజమాన్యంతో ఇంటర్ విద్యాధికారి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్ బోర్డు నిబంధనల మేరకు కార్యాలయ ఫైల్‌లు, రిజిస్టర్లన్నీ కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎలాంటి తప్పిదాలు దొర్లకుండా విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని పనిచేయాలన్నారు. అవసరమైన సూచనలు, సలహాలు తీసుకుని జాగ్రత్తగా ప్రతి అంశాన్ని క్రోడీకరించాలని అన్నారు. విద్యార్థుల డేటాను సరిచేసుకునేందుకు సబ్జెక్టులు మార్చుకునేందుకు, ఫోటో సంతకం తప్పిదం దొర్లితే సరిదిద్దుకోవడానికి ఇంటర్ బోర్డు మరో అవకాశం ఇచ్చిందని క్షుణ్ణంగా పరిశీలించి డేటాను కంప్యూటర్లలో నిక్షిప్తం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశాల మేరకు నిబంధనలను అతిక్రమించిన



గోల్డెన్ జూబ్లీ కళాశాలను తనిఖీ చేస్తున్న డీఐఈవో రవికుమార్

ఏ కళాశాలపై అయిన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపూడి రవికుమార్ అన్నారు. కళాశాల ఆవరణతో పాటు, తరగతి గదులను, ప్రయోగశాలలను, కనీసం అవసరాల కల్పనపై పర్యవేక్షణ చేశారు. నియమ నిబంధనల ప్రకారం ఫైళ్ళ నిర్వహణ, పాలనాపరమైన అనుమతులు, పరీక్ష ఫీజుల వసూలు, ఇతర అన్ని రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్, సిబ్బంది, అధ్యాపకులు హాజరయ్యారు. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ సూచించిన మేరకు ప్రణాళిక బద్ధంగా బోధన నిర్వహణ జరగాలని ఆదేశించారు.


రాష్ట్ర సహకార యూనియన్ సమావేశం



నవతెలంగాణ-ముప్కాల్

హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లి 'సుందరయ్య విజ్ఞాన వేదిక'లో బుధవారం ఉదయం తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో (పీఏసీఎస్, డీసీసీబీ, మార్క్‌ఫైడ్) చైర్మన్లతో జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి హాజరయ్యారు. సొసైటీలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వారికి పలు అంశాలపై సూచనలను అందజేశారు. కార్యక్రమంలో వేంపల్లి సొసైటీ చైర్మన్ జక్కు రాజేశ్వర్‌తో పాటు ఆయా సొసైటీల చైర్మన్‌లు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పలువురు

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని దాస్‌నగర్ సమీపంలో గల ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో నిజామాబాద్ జిల్లా ఆంటీ నార్కోటిక్ బ్యూరో, మాక్లూర్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు గంజాయి, మత్తు పదార్థాలపై బుధవారం అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే అనారోగ్యాల పాలవుతారని, కొన్ని సందర్భాల్లో ప్రాణాలను కూడా కోల్పోవలసి వస్తుందని, వారి కుటుంబాలు అనాథలుగా మిగులుతాయని వివరించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ నార్కోటిక్స్ ఎస్సై పూర్ణేశ్వర్, నరసింహులు, స్థానిక ఎస్సై రాజశేఖర్, సిబ్బంది, కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

జూనియర్ బాలికల కబడ్డీ సెలక్షన్స్

నవతెలంగాణ-ముప్కాల్

హైదరాబాద్ పట్టణ కేంద్రంలో హకీమ్‌పేట క్రీడా మైదానంలో ఈ నెల 22 నుంచి 25 వరకు 50వ జూనియర్ అండర్-20 బాలికల ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీలలో పాల్గొనే జిల్లా కబడ్డీ జట్టు సెలెక్షన్ ఈ నెల 20న శుక్రవారం ఉదయం 10 గంటలకు ముప్కాల్ మండల కేంద్రంలోని 'భూదేవ్ ఇండోర్ స్టేడియం'లో చేపట్టనున్నట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు అంద్యాల లింగయ్య, ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల19వ తేదీన సాయంత్రంలోపు రిపోర్ట్ చేయాలని సూచించారు. 2005 జనవరి 12కు ముందు జన్మించిన వారికి అర్హత లేదన్నారు. అదేవిధంగా బరువు 65 కిలోల మించకూడదని, వయస్సు నిమిత్తం పదోతరగతి, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9618088086 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

వృత్తి నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న మహిళ సాధికారత సంస్థ సమన్వయకర్త

నవతెలంగాణ-బోధన్

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన కేంద్రంలో యువతులు స్వయం ఉపాధి శిక్షణతో ఉపాధి అవకాశాలు పొందవచ్చని మహిళ సాధికారత సంస్థ జిల్లా సమన్వయకర్త స్వప్న అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని మధుమలాంచ జూనియర్ కళాశాలలో శిశు వికలాంగుల, వయోవృద్ధుల శాఖ జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన కేంద్రంలో యుక్త వయసులో ఉన్న విద్యార్థిని విద్యార్థులకు వృత్తి నైపుణ్యం విద్యపై శిక్షణ నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని అన్నారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం చేస్తున్న అన్ని కార్యక్రమాలపై విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ చూపించాలని, జీవిత లక్ష్యాలను సాధించేలా ప్రయత్నాలు చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో గల శిక్షణల గురించి, దరఖాస్తులు చేయడంపై అక్కడ కల్పించే వసతుల గురించి అందించే కోర్సుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్స్ ఆసియా, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన మొబలైజర్ ప్రదీప్, కళాశాల ప్రిన్సిపాల్ అధ్యాపకులు పాల్గొన్నారు.

భగీరథ నీటి లీకేజీలు తగ్గేది ఎప్పుడు?

నవతెలంగాణ-సదాశివనగర్



సదాశివనగర్ మండలంలోని మిషన్ భగీరథ పైప్ లైన్ ప్రతిరోజు ఏదో ఒక దగ్గర లీకేజ్ అవుతూనే ఉంది తగ్గేది ఎప్పుడు అని పలువురు చర్చించుకుంటున్నారు. లీకేజీల దగ్గర మురికి ఏర్పడి అందులోకి ఇతర మురికి నీరు చేరుతుందని, దీంతో నీరు కలుషితం అవుతున్నట్టు స్థానికులు మండిపడుతుఆన్నరు. లీకేజీల శాశ్వత పరిష్కారం లేదా అని ప్రశ్నిస్తున్నారు. లీకేజీల వలన ప్రతి గ్రామంలో వారానికి ఒకటి లేదా రెండు రోజులు నీరు సరఫరా కావడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. భగీరథ నీటి పైపులు శాశ్వతంగా లీకేజీ కాకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మాడల్ గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తాం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)



గ్రంథాలయాలను ఆధునికంగా ఏర్పాటు చేస్తున్నా మని, అందరి సహకారం అవసరమని కామారెడ్డి జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ మద్ది చంద్ర కాంత్ రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డి గ్రంథాలయాన్ని బుధవారం సందర్శించారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటిసారి ఎల్లారెడ్డి గ్రంథాలయానికి వచ్చిన సందర్భంగా ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. చైర్మన్ మాట్లాడుతూ గ్రంథాల యానికి రోజువారి పాఠకులు వచ్చేలా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ప్రయత్నం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కురుమ సాయిబాబా, పట్టణ అధ్యక్షులు వినోద్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పిఏసిఎస్ డైరెక్టర్ నాగం గోపికృష్ణ, మాజీ సర్పంచ్ పప్పు వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిగా విస్తరిస్తే మేలు

రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం

- **కేకేపై రోడ్డుపై అసెంబ్లీలో ప్రస్తావించిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు**

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కరీంనగర్-కామారెడ్డి-ఎల్లారెడ్డి మీదుగా పిట్లంలో 161వ జాతీయ రహదారికి అనుసంధానం చేసే జాతీయ రహదారిని నిర్మిస్తే.. ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలకు రవాణా పరంగా మేలు జరగనున్నట్టు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో కేకేవై రోడ్డు నిర్మాణంపైముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజల వరప్రదయిని అయిన కరీంనగర్-కామారెడ్డి-ఎల్లారెడ్డి రోడ్ నిర్మాణం చేపట్టాలన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గానికి వరప్రదాయ నిగా మారబోతున్న కామారెడ్డి కరీంనగర్ ఎల్లారెడ్డి జాతీయ రహదారి గురించి సభ దృష్టికి తీసుకువచ్చారు.

జాతీయ రహదారిగా ప్రతిపాదిస్తున్న (కరీంనగర్-కామారెడ్డి-ఎల్లారెడ్డి) రహదారి కరీంనగర్ పట్టణం నుంచి మొదలై సిరిసిల్ల కామారెడ్డి పట్టణాల మీదుగా ఎల్లారెడ్డి పట్టణము వద్ద ముగుస్తుందన్నారు. జాతీయ రహదారి కరీంనగర్ పట్టణానికి సమీపంలో ఉన్న ఎన్.హెచ్-563 జంక్షన్ నుండి ప్రారంభమై సిరిసిల్ల పట్టణం వద్ద ఎన్.హెచ్-365 బీ క్రాస్ చేస్తూ కామారెడ్డి పట్టణ సమీపంలో ఎన్ హెచ్ -44 క్రాస్ చేసి ఎల్లారెడ్డి పట్టణంలోకి ప్రవేశిస్తుందన్నారు. ఎల్లా రెడ్డి పట్టణము గుండా పోతున్న ఎస్‌హెచ్-డీని క్రాస్ చేసిన అనంతరం (బొగ్గు గుడిసె చౌరస్తా మంజీర నది నిజాం సాగర్ ప్రాజెక్టు) మీదుగా పిట్లం వద్ద ఎన్ఎచ్-161 తో కలిసిపోతుందన్నారు.

నిజాంసాగర్ రోడ్డు ను సుమారుగా 100 ఏళ్ల క్రితం 1923 వ సంవత్సరంలో మంజీరా నదిపై నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మించే సమయంలో అప్పటి నిజాం నవాబు కామారెడ్డి పట్టణం నుండి ప్రతిపాదిత సాగునీటి ప్రాజెక్టు వరకు ఒక (ఎద్దుల బండిలు పోయే రోడ్డు) రోడ్డును నిర్మించారని, తదనంతర కాలంలో ఈ కార్ట్ ట్రాక్ రోడ్డుకు చిన్నచిన్న వెడల్పులు చేస్తూ బిటి రోడ్డు నిర్మిస్తూ పోవడంతో ప్రస్తుతమున్న రోడ్డు ఏర్పడిందని ఆయన అన్నారు ఈ విధంగా ఎలాంటి జియోమెట్రికల్ డిజైన్ లేకుండా అస్తవ్యస్తంగా ఈ రోడ్డును నిర్మించడంతో ఈ రోడ్డు వెంబడి కామారెడ్డి నుండి ఎల్లారెడ్డి వరకు అనేక మలుపులు లు న్యారో బ్రిడ్జిలు ఉండడంతో ప్రతిఏటా వందలకొద్ది రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రతేటా రోడ్డు ప్రమాదాలలో కనీసం 20 మంది మృత్యువాత పడుతున్నారని, వందల మంది గాయాల పాలవుతు న్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న ఈ జాతీయ రహదారి వలన ఈ రహదారిపై రోడ్డు ప్రమాదాలు ఆగి వందలమంది ప్రజల ప్రాణాలు పోకుండా ఆపగలిగిన వారు అవుతామని వేములవాడ పుణ్యక్షేత్రం నుండి మొదలుకొని శబరిమాత పుణ్యక్షేత్రం నిజాంసాగర్ ప్రాజెక్టు పోచారం ప్రాజెక్టు పర్యాటకుల సందడి ఉంటుందన్నారు.

రైతులకు అండగా ఉండి సేవ చేస్తా

- **మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జక్కుల రాజిరెడ్డి**

నవతెలంగాణ-తాడ్వాయి



రైతులకు అండగా ఉండి సేవ చేస్తానని సదాశివనగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జక్కుల రాజిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మాట్లాడారు. తనపై నమ్మకంతో పదవి అప్పజెప్పిన మదన్ మోహన్‌రావును మర్చిపోనని కమిటీ పరిధిలో ఉన్న రైతాంగానికి అన్ని విధాలుగా సేవలుఅందిస్తానన్నారు. తనకు వ్యవసాయ రంగంలో ఉన్న అనుభవాన్ని గమనించి తనకు పదవి కట్టుబెట్టారని తెలిపారు. వరి ధాన్యానికి 500 రూపాయల బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేన్నారు. గత ప్రభుత్వాలు రైతాంగ సమస్యలపై ఏమాత్రం పట్టించుకోలేదని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం రైతు ప్రభుత్వమేనని తలిపారు. ఇచ్చిన హామీలు పూర్తి చేస్తుందని గుర్తు చేశారు. వచ్చే పంచాయతీ ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర మీడియా ఉపాధ్యక్షులుగా బోడ సాయిలు



మాట్లాడుతున్న రాష్ట్ర మీడియా ఉపాధ్యక్షులు బోడ సాయిలు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని కౌలాస్ గ్రామానికి చెందిన వ్యక్తిని 17న తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం మీడియా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా జుక్కల్ మండలం సీనియర్ జర్నలిస్టు బోడ సాయిలు ఎన్నికయ్యారు. సికింద్రాబాద్ హరిహర కళభవన్‌లో జరిగిన కార్యక్రమంలో అయన పదవి ప్రమాణస్వీకారం చేశారు. నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షులు వాళ్ళకాటి రాజకుమార్ అధ్యక్షతన ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు సిరిగాధ లక్ష్మి నర్సింలు, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్లు జంగం గంగాధర్, పద్మ శ్రీకాంత్, మద్నూర్, కామారెడ్డి నాయకులు డాక్టర్ సుంకి రమణ, శ్రీధర్, పిశెట్టి, చాట్ల రాజేశ్వర్, ధర్మపురి, సబ్బానీ హరి, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా హౌస్ హెూల్డ్ సర్వే



సర్వే నిర్వహిస్తున ఎంపీవో రాము

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని గ్రామాలలో హౌస్ హెూల్డ్ సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. బుధవారం బిజ్జల్వాడి గ్రామంలో హౌస్ హెూల్డ్ సర్వేను ఎంపీఓ రాము పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో హౌస్ హెూల్డ్ సర్వేలలో కొంతమంది గ్రామాల నుంచి పట్టణాలకు బతుకుతెరువుకు వెళ్లడంతో సమస్య దయనీయంగా ఉందని తెలిపారు. వారి అడ్రస్సులు ఫోన్ నెంబర్లు లేకపోవడంతో సమాచారం అందించాలంటే కష్టతరంగా మారిందన్నారు. ఇట్టి విషయంలో గ్రామస్తులతో చర్చించి వలస వెళ్లిన వారి కుటుంబాల అడ్రస్సులు ఫోన్ నెంబర్లు సేకరించడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ, తదితరులు పాల్గొన్నారు.

టీచింగ్ లెర్నింగ్ పరిశీలించిన ఎంఈవో



మాట్లాడుతున్న ఎంఈవో

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

ఫండమెంటల్ అండ్ లిట్రసీ న్యూమారికల్ బోధన పద్ధతిని పెద్ద కొడప్‌గల్ మండల విద్యాధికారి ప్రవీణ్ కుమార్ వడ్లం కాంప్లెక్స్ ఉపాధ్యాయుల సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని విద్యార్థులతో పాఠ్యపుస్తకం చదవడం ఆయన పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులు పాఠ్యం బోధించడం, పలు విషయాలపై ఆయన ఉపాధ్యాయులకు సూచనలు చేశాడు. అనంతరం ఎడ్యుకేషనల్ అప్లికేషన్లో బేసిక్ పయుంట్లను అప్లోడ్ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వల్లబ్రాప్, ఉపాధ్యాయులుతదితరులు పాల్గొన్నారు.

బోరు మోటర్ ప్రారంభం

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని బాణాపూర్ గ్రామంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు గోపాల రాముల ఆధ్వర్యంలో బోరు మోటర్‌ను ప్రారంభించారు. గ్రామంలో గోపాల అంజయ్య ఇంటి వద్ద తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో ఈ విషయం ఎమ్మెల్యే మదన్ మోహన్ వు దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన ఆదేశాలకు ఏర్పాటు చేయించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో హరిసత్యం, సాయిలు, అమీన్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

ప్రమాదకర ప్రాంతం పరిశీలన



ప్రమాదకర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐ

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలోని సదాశివనగర్ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ముందు ఉన్నటువంటి నేషనల్ హైవే జంక్షన్‌ను నేషనల్ హైవే అధికారులు స్థానిక సి.ఐ సంతోష్ కుమార్ , సదాశివనగర్ ఎస్సై, రంజిత్ కుమార్ గ్రామస్తులు, జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్ యొక్క అధ్యాపకులు కలిసి బుధవారం పరిశీలించారు. ప్రమాదాల నివారణ చర్యలపై చర్చించారు. ఇట్టి సూచనలపై నేషనల్ హైవే అధికారులు, తదుపరి చర్యలపై హామీ ఇచ్చినట్టు తెలిపారు.

ఛలో రాజ్ భవన్ నిరసనలో పాల్గొన్న నాయకులు



నిరసనలో పాల్గొన్న నాయకులు

నవతెలంగాణ-సదాశివనగర్

టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఛలో రాజ్ భవన్ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు. దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే లా గౌతమ్ అదానీ ఆర్థిక అవకతవకలు, మణిపూర్ అల్లర్లపై ప్రధాని మోదీ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఏఐసీసీ పిలుపు మేరకు ఛలో రాజ్ భవన్ కార్యక్రమం చేపట్టారు. కాగా జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు , రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, రామారెడ్డి మండల మాజీ జెడ్పిటిసి నా రెడ్డి మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బూట్లు, సాక్సుల వితరణ



విద్యార్థులకు బూట్లు, సాక్సులు అందజేత

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

ఎల్లారెడ్డి మండలంలోని అన్నసాగర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బూట్లు, సాక్సలను మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ బుధవారం అందజేశారు. గ్రామస్తుల కోరిక మేరకు రెండువారాల క్రితం స్కూల్‌ను సందర్శించారి కొనుగోలు చేసి ఇస్తాననమి ఇచ్చిన మాట ప్రకారం మొత్తం 67 మంది విద్యార్థులకు అందజేసినట్టు తెలిపారు.

ఈ సంధ్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనరాయణ మాట్లాడుతూ బాగా చదువుకోవాలని నేటి బాలలే రేపటి పౌరులు అని తెలియజేస్తూ ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన మలావత్ పూర్ణ ను ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలని ఆయన అన్నారు. ఆయన వెంట ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకట్రాం రెడ్డి, ఎల్లారెడ్డి మండల యూత్ ఉపాధ్యక్షులు కిరణ్, మాజీ జడ్పీటీసీ సామెల్, తిమ్మారెడ్డి మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లారెడ్డి సొసైటీ డైరెక్టర్ చెన్నంగారి సుఖేందర్ రెడ్డి, అడవి లింగాల శ్రీనివాస్ రెడ్డి, గ్రామ అధ్యక్షులు కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ గురుప్రతాప్, తదితరులున్నారు.

మైనార్టీ గురుకుల విద్యార్థులను అభినందించిన కలెక్టర్

నవతెలంగాణ-లింగంపేట్



గురుకుల విద్యార్థులను సన్మానించి అభినందిస్తున్న కలెక్టర్

అదిలాబాద్ జిల్లాలో జన విజ్ఞాన వేదిక నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాలలో కామారెడ్డి జిల్లాకు రాష్ట్రస్థాయిలో తృతీయ బహుమతి తీసుకువచ్చిన విద్యార్థులను బుధవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆయన ఛాంబర్‌లో అభినందించారు. ప్రతిభ కనబరిచిన లింగంపేట్ మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు రాహుల్, రెహమాన్, ముఖేష్‌ను శాలువా కప్పి సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరచాలని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సహించనున్నట్టు తెలిపారు. భవిష్యత్తులో ముందుకు వెళ్లాలని మరింత ప్రతిభ కనబరచాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి దయానంద్ డిఈఓ రాజు ఆర్ఎల్ సి కిరణ్ గౌడ్ ప్రిన్సిపాల్ పి.వెంకట్ రాములు పాఠశాల సమన్వయకర్త గోపాల్ గైడ్ టీచర్ మల్లేష్ ఎ.లింగం వార్డెన్ సాజిత్ తదితరులు పాల్గొన్నారు.

మినుము సాగుపై ఆసక్తి

- **రబీలో పెరిగిన విస్తీర్ణం**

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ ఉమ్మడి మండలంలో అత్యధికంగా వానకాలం పంట సాగులో భాగంగా ఇక్కడి రైతులు మినుపంట సాగు చేసేవారు. ప్రస్తుతం రబీ పంట సాగులో కూడా మినుము పంట సాగుపై మద్నూర్ ఉమ్మడి మండలంలోని రైతులు ఆసక్తి చూపుతున్నారు. రబి పంట సాగులో మినుము పంట సాగుకు ఇక్కడి రైతులు బర్రె మినుము అంటారు. గత ఏడాది సాగును పోలిస్తే ఈ ఏడాది సాగు విస్తీర్ణం రెట్టింపు అయ్యే అవకాశం కనిపిస్తుంది.

వ్యవసాయ అధికారులు అంచనాల ప్రకారం గత ఏడాది రబీ పంట సాగులో మినుము పంట సాగు మద్నూర్ ఉమ్మడి మండలంలోని మద్నూర్ డోంగ్లి మండలాల పరిధిలో 1600 ఎకరాల నుండి 1800 ఎకరాల వరకు సాగయినట్లు అంచన. ప్రస్తుతం దానికి రెట్టింపుగా సాగు చేసినట్టు సమాచారం. ఎక్కడ చూసినా మినుము పంట కనపిస్తుంది.

ప్రతేడాది రబీ సీజన్‌లో ఉమ్మడి మండలంలో శనగ పంట సాగు అధికంగా వేసేవారు. ఈ ఏడాది కూడా అత్యధికంగా సెనగ పంట సాగు అయినప్పటికీ పంట పైన పంట ఒకే రకమైన సాగు చేస్తే పంటకు తెగుళ్ల అలాగే దిగుబడి తగ్గే అవకాశాలు ఉంటాయని అధికారుల సూచనల మేరకు శనగ పంట సాగులో కొంతమేరకైన తగ్గించి రైతన్నలు మినుము పంట సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు.



సీఎం, డిప్యూటీ సీఎం ముఖచిత్రాలతో

నిరసన తెలిపిన సమగ్ర శిక్ష ఉద్యోగులు

నవతెలంగాణ-కామారెడ్డి

సీఎం, డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రుల ముఖ చిత్రాలతో రోడ్డుపై బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చర్చల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తూన్నారని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘ నాయకులను పిలిచి మాకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని లేదంటే సమ్మెను ఉధృతం చేస్తామన్నారు. కామారెడ్డి జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల 9వ రోజులో భాగంగా నేడు వినూత్న రీతిలో గత సంవత్సరం పిసిసి అధ్యక్ష హెూదాలో ఉన్న రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయగానే నేను మిమ్మల్ని చర్చలకు పిలిచి మీ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, సీతక్క, (ధనసరి అనసూయ) ముఖచిత్రాలను ధరించి నిరవధిక నిరసనను సమగ్ర శిక్ష ఉద్యోగులు తెలిపారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ట్రాఫిక్ పెట్రోలింగ్ బైక్ ప్రారంభం

నవతెలంగాణ-కామారెడ్డి



ట్రాఫిక్ పెట్రోలింగ్ బైక్‌లను ప్రారంభిస్తున్న పోలీసులు

కామారెడ్డి పట్టణంలో రెండు ట్రాఫిక్ పెట్రోలింగ్ మోటార్ సైకిల్ లను, ఒక బ్లూకోల్ట్‌ను ప్రారంభించినట్టు పట్టణ సిఐ చంద్రశేఖర్ రెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా పట్టణము విస్తరిస్తున్న కారణంగా, నేరాలను అదుపు చేయుటకు గాను జిల్లా ఎస్పీ ఆదేశానుసారంగా పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు ట్రాఫిక్ పెట్రోలింగ్ మోటార్ సైకిల్ లను, అశోక్ నగర్, స్నేహపురి కాలనీ, శ్రీరామ్ నగర్, వివేకానంద కాలనీ, శ్రీనివాస్ నగర్, మొ.గు. కాలనీలను కలుపుకొని ఒక బ్లూకోల్ట్ రెండు షిఫ్ట్ లు 24 గంటలు అందుబాటులో ఉండేట్లుగా బుధవారం నుండి ప్రారంభించినట్టు తెలిపారు.

పట్టణంలో ఉన్న ముఖ్యమైన చౌరస్తాలలో ట్రాఫిక్‌కి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు గాను, అశోక్ నగర్ ఎక్స్‌రోడ్, నిజాంసాగర్ ఎక్స్ రోడ్, పాత బస్టాండ్, రామారెడ్డి చౌరస్తా, సుభాష్ రోడ్డు నందు ట్రాఫిక్ నీ క్రమబద్ధీకరించేందుకు సిబ్బందిని నియమించామని, కావున ప్రజలందరూ పోలీసు వారి సేవలను వినియోగించుకోవాలని, పోలీస్ వారికి విధి నిర్వహణలో తప్పనిసరిగా ప్రజలు సహకరించాలని కోరుతున్నాము అన్నారు.

నీటి సమస్య తీర్చేందుకు బోరు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని 41వ వార్డులో నీటి సమస్య ఉంది అని తన దృష్టికి రావడంతో వెంటనే స్పందించి బోర్ వేయించినట్టు కామారెడ్డి మున్సిపల్ చైర్పర్స న్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. బుధవారం మోటర్ బిగించిన అనంతరం కొబ్బరికాయ కొట్టి బోర్ ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణంలో చెట్లు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, చెట్లను నాటి పెంచడం వల్ల పర్యావరణాన్ని కాపాడిన వారిమౌతామన్నారు. కార్యక్రమంలోని, పట్టణ కౌన్సిలర్లు, పాత శివ కృష్ణమూర్తి, పంపరి లతా శ్రీనివాస్, పిడుగు మమత సాయిబాబా,వనిత రామ్మోహన్, జిల్లా సెక్రటరీ పంపరి లక్ష్మణ్, సీనియర్ల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే


ఆర్మూర్: సర్వే చేస్తున్న అధికారులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని 2, 9, 18, 24, 26, 35వ వార్డులలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను మున్సిపల్ కమిషనర్ రాజు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సర్వేచేయాలని, సరైన సమాచారం సేకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఆఫీసర్లు గజానంద్, ఉదయ శ్రీ, ఆయా వార్డ్ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో ఇందిరమ్మ గృహాల సర్వేను ఆయన పరిశీలించారు. ప్రతి ఇంటికి వెళ్లి సర్వేను పక్కాగా పూర్తి చేయాలని గ్రామ కార్యదర్శి రాఘవేందర్ గౌడ్‌కు సూచించారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలన్నారు. ఆయన వెంట మండల గిర్ధవార్ మన్సూర్, గ్రామ కార్యదర్శి రాఘవేందర్‌గౌడ్, కారోబార్ అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ


చెక్కును అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండల కేంద్రానికి చెందిన రుద్రారపు జమనకు రూ.38 వేలు, రొక్కెడ సరితకు రూ.19 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ కింద చెక్కులు రాగా వాటిని కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం బాధితులకు అందజేశారు. చెక్కుల మంజూరుకు కృషిచేసిన బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్‌రెడ్డికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్, గ్రామశాఖ అధ్యక్షులు రేండ్ల రాజారెడ్డి, పన్నాల నర్సారెడ్డి, బొర్రన్న తదితరులు పాల్గొన్నారు.

పాతకేసు విచారణ.. ఒకరికి జైలుశిక్ష

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం కల్దుర్కి గ్రామానికి చెందిన బుయ్యన్‌వార్ హన్మంత్ అనే వ్యక్తికి సంబంధించిన 2015లో చీటింగ్ కేసులో బుధవారం బోధన్ కోర్టు మొదటిశ్రేణి న్యాయమూర్తి పూజిత విచారణ జరిపి నిందితునికి సంవత్సరం, ఆరునెలల పాటు జైలుశిక్ష, వెయ్యి రూపాయల జరిమాన విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు బోధన్ పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు.

అథ్లెటిక్స్, సైక్లింగ్, ఖోఖో పోటీలు


సైక్లింగ్‌ను ప్రారంభిస్తున్న పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ వారి ఆదేశాల మేరకు గ్రామీణ స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం సీఎం కప్-2024 క్రీడాకారులకు పోటీలను నిర్వహించారు. ఈ పోటీలు గ్రామపంచాయతీ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్నారు. అందులో భాగంగా బుధవారం కిక్ బాక్సింగ్ క్రీడాకారులను ఎంపిక చేశారు. అథ్లెటిక్స్, సైక్లింగ్, ఖోఖో పోటీలలో దాదాపు 1400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా స్థాయి క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన, ఎంపికైన వారికి ఈనెల 27 నుంచి 02 జనవరి 2025 (07 రోజులు) వరకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు పంపనున్నట్టు జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తన్న తెలిపారు. నేడు (గురువారం) యోగ పోటీలు బాల్ భవనం నందు, ఆర్చరీ ఎంపికలు రాజారాం స్టేడియం నాగారంలో, కబడ్డీ పోటీలు ఓల్డ్ కలెక్టర్ గ్రౌండ్‌లో, బాడ్మింటన్ ఆఫీసర్స్ క్లబ్‌లో, ప్రెస్లింగ్ పోటీలు స్విమ్మింగ్ పూల్ సుభాష్‌నగర్‌లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. అందుకు మండల స్థాయి విజేతలు ఈ క్రీడా ప్రాంగణాలకు ఉదయం 9 గంటలకు తమ వెంట ఆధార్‌కార్డు లేదా పుట్టిన తేదీ తెలిపే ధృవీకరణ పత్రంతో హాజరుకావాలని సూచించారు.

సావిత్రిబాయి ఫూలే పురస్కారాల కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో బిసిటియు ఆధ్వర్యంలో జనవరి 5వ తేదీన నిర్వహించే సావిత్రిబాయి ఫూలే పురస్కారాల కరపత్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ మంగళవారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఇఓ మాట్లాడుతూ.. సావిత్రిబాయి ఫూలే గొప్ప సంఘసంస్కర్త అని, భారత దేశ చరిత్రలోనే స్త్రీ విద్యను ప్రవేశ పెట్టిన ఘనత ఆమెదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ కొట్టాల రామకృష్ణ, అసోసియేటెడ్ అధ్యక్షులు ఎ.మోహన్, గౌరవ అధ్యక్షులు కైరంకొండ బాబు, ఉపాధ్యక్షులు మహేందర్, మాక్లూర్ మండల బిసిటియు అధ్యక్షులు గంగోనె సంజీవ్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి, నవీపేట్ ఎంఈవో అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నాయకులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు పట్టణ కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సంజీవరెడ్డి, మాజీ సర్పంచ్ నాగభూషణం గౌడ్ అనారోగ్యం విషయం తెలుసుకొని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ బుధవారం పార్టీ నాయకుల నివాసంలో పరామర్శించారు. నాయకులకు, కార్యకర్తలకు బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయనవెంట బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రామేశ్వర్ పల్లి సొసైటీ చైర్మన్ భూమ్ రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షులు మల్లేశం, సీనియర్ నాయకులు మహేందర్ రెడ్డి, పట్టణ మాజీ సర్పంచ్ వేణు, మాజీ వైస్ ఎంపీపీ యాదగిరి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

దిల్ రాజుకు సన్మానం

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నరాల నిహార్ ఫిల్మ్ ఇండస్ట్రీ చైర్మన్ దిల్ రాజును బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్ర ఫిల్మ్ ఇండస్ట్రీ చైర్మన్‌గా నియామకం అయినందుకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

యువకుడి హత్య కేసులో ముగ్గురి రిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని గంజ్ గోశాల వద్ద జరిగిన యువకుడి హత్య కేసులో ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 15న రాత్రి సమయంలో ఓ పాన్ షాపు వద్ద జరిగిన గొడవలో గైక్వాడ్ చంద్రకాంత్ (22) మృతి చెందిన విషయం తెలిసిందే. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులు మనీష్కుమార్, సాయికృష్ణ, రుతిక్ గౌడ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరిని బుధవారం కోర్టు ఎదుట హాజరుపర్చగా.. న్యాయస్థానం 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.

గౌడ సమస్యల సాధనకై కృషి చేస్తా

నవతెలంగాణ-కామారెడ్డి

గౌడ సమస్యల సాధనకై నిరంతరం కృషి చేస్తానని జై గౌడ ఉద్యమం ఎల్లారెడ్డి నియోజకవర్గ యూత్ విభాగం అధ్యక్షుడు తాటిపాముల ప్రశాంత్ గౌడ్ అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జై గౌడ ఉద్యమం కార్యాలయంలో కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు రంగోల మురళి గౌడ్ నాయకత్వంలో జై గౌడ ఉద్యమం ఎల్లారెడ్డి నియోజకవర్గ యూత్ విభాగం అధ్యక్షుడిగా బుధవారం నియామక పత్రం అందజేశారు. అర్హత కలిగిన ప్రతి గీత కార్మికునికి లైసెన్సులను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జై గౌడ ఉద్యమం కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అంకన్న గారి శ్రీనివాస్ గౌడ్, నాయకులు ఇందూరి సిద్దా గౌడ్ ,అన్నగోని నర్సాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల ధూంధాం

- పాటలు పాడుతూ 12వ రోజు నిరసన



నిరసనలో పాల్గొన్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నిజామాబాద్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చౌరస్తా ధర్నా చౌక్‌లో 12వ రోజు సమ్మెలో భాగంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల ధూమ్ ధామ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాటలు పాడుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజు, భూపెందర్ మాట్లాడుతూ.. తమ న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం 12 రోజులుగా సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవట్లేదని అన్నారు. ఇకనైనా తమ న్యాయపరమైన డిమాండ్ అయినా రెగ్యులరైజేషన్ సత్వరమే చేయాలని కోరారు. 20 సంవత్సరాలుగా విద్యాశాఖలో భాగమైన సమగ్ర శిక్షలో అతి తక్కువ వేతనాలతో వెట్టిచాకిరీ చేస్తూ విద్యాశాఖను సర్వతోముఖాభివృద్ధికి తీసుకెళ్తూ కష్టపడుతున్నా.. కనీస వేతనాలు లేక కుటుంబాలు ఆపసోపాలు పడుతున్నారని తెలిపారు. తమ సమస్య పరిష్కారం కోసం 12 రోజులుగా సమ్మె చేస్తున్నా.. పట్టించుకోవడం లేదన్నారు. ఈ దీక్షలకు పిఆర్‌టియూ నాయకులు నాలేశ్వర్, ప్రధానోపాధ్యాయులు శ్రీదీప్, సాగర్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్, మహిళా అధ్యక్షురాలు గంగామణి, నాయకులు ప్రకాష్, అప్సర్, రవి కిరణ్, జాన్, సత్యపాల్, గంగాధర్, ప్రభు, రమేష్, రాణి, సుప్రజ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

గౌతమి పాథోలాజికల్ ల్యాబ్‌లో చోరీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని ఒకటవ పోలీస్‌స్టేషన్ పరిధిలో ల్యాబ్‌లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. నగరంలోని ఖలీల్‌వాడీలో గల గౌతమి పాథోలాజికల్ ల్యాబ్‌లో మంగళవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు షెటర్ పగులగొట్టి ల్యాబ్ నుంచి రూ.10వేలు అపహరించినట్లు బాధితులు పేర్కొన్నారు. బాధితుల సమాచారం మేరకు సీఐ రఘుపతి, ఎస్ఐ మోగులయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం ద్వారా ఆదారాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


గౌతమి లాబ్‌ను పరివీక్షిస్తున్న పోలీస్ అధికారి

జిల్లా కేంద్రాలలో కోచ్‌లను భర్తీ చేయండి

- ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఈగ సంజీవరెడ్డి


సన్మానించిన పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా కేంద్రాలలో కోచ్‌లను భర్తీ చేయాలని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఈగ సంజీవరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలోని ఒలంపిక్ భవనంలో నూతనంగా ఎన్నికైన రాష్ట్ర ఒలంపిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జితేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, కోశాధికారి సతీష్‌గౌడ్‌ను నిజామాబాద్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈగ సంజీవరెడ్డి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ఒలింపిక్ అధ్యక్షులు మాట్లాడుతూ.. క్రీడల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. జిల్లా, నియోజకవర్గ పరిధిలో అన్ని సౌకర్యాలతో స్టేడియాలు నిర్మించాలని, జిల్లా కేంద్రాలలో కోచ్‌లను భర్తీ చేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ మైదానానిన త్వరగా నిర్మించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలో క్రీడాలకు సరైన సౌకర్యాలు లేకున్నా.. అంతర్జాతీయ క్రీడాకారులు ఉన్నారని, మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారని అన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి జగదీష్ యాదవ్, తెలంగాణ అర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అరవింద్, జిల్లా సెపక్ తక్రా కార్యదర్శి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గాధారి సంజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

- ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

పాఠశాలలో విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని బషీరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనాన్ని అందించాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన ఆహార పదార్థాలను ఆయన తనిఖీ చేశారు. శుభ్రమైన వాతావరణంలో కలుషితం కాకుండా మధ్యాహ్న భోజనాన్ని సిద్ధం చేయాలన్నారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించకపోతే తగిన చర్యలు ఉంటాయని నిర్వాహకులకు సూచించారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించారు. తరగతి గదులను సందర్శించి ఉపాధ్యాయుల విద్య బోధన తీరును, విద్యార్థులతో మాట్లాడి ఇప్పటివరకు పూర్తయిన సిలబస్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులకు పలు సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగాధర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

చక్కెర ఫ్యాక్టరీలు తెరవకపోతే

ట్రాక్టర్లతో రైతు ఉద్యమం చేపడతాం

- సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లాలో ఉన్న ఎన్ఎస్ఎఫ్, ఎన్సిఎస్ఎఫ్ షుగర్ ఫ్యాక్టరీలను తెరవకపోతే భవిష్యత్తులో వందలాది ట్రాక్టర్లతో రైతు ఉద్యమం చేపడతామని సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య తెలియజేశారు. అఖిల భారత రైతు కూలీ సంఘం నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పాత కలెక్టర్ కార్యాలయం ముందు గల ధర్నా చౌక్‌లో రెండువందల మంది రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీగా ఇచ్చిన, జిల్లాకు చెందిన రెండు షుగర్ ఫ్యాక్టరీలను వెంటనే తెరిపించాలని డిమాండ్ చేశారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాలో గల రెండు చక్కెర ఫ్యాక్టరీలను తెరిపిస్తామని, దాని కోసం సబ్ కమిటీ వేసి కాలాయపన చేస్తూ ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. బోధన్‌లో ఉన్న నిజాంషుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వమే స్వాధీనం చేసుకుని వెంటనే ప్రారంభించాలని అన్నారు. షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో ఉన్న రైతులకు చెరుకు పంట వేయడానికి అవసరమైన అడ్వాన్సులు, బోనస్‌లు ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నిజామాబాద్ నగరానికి సమీపంలో, సారంగాపూర్‌లో ఉన్న సహకార చక్కెర పరిశ్రమను బెల్లం పరిశ్రమగా మార్చి వెంటనే ప్రారంభించాలని అన్నారు. రైతులకు అవసరమైన ప్రోత్సాహకాలు అందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను చేపడుతున్నారని, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వ్యవసాయ రంగంలో తెచ్చిన మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన రైతు ఉద్యమానికి ఇచ్చిన లిఖితపూర్వక హామీని విస్మరించిందని అన్నారు. ఎంఎస్పి మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని తీసుకువచ్చి రైతుల అప్పులన్నీ మాఫీ చేయాలని, రైతులను రుణ విముక్తి చేయాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో రైతు నాయకులు ఎఫ్‌పిఓ చైర్మన్ మచ్చర్ల నాగయ్య, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయిరెడ్డి, ఉపాధ్యక్షులు బి.సాయిలు, పర్వయ్య, అగ్గు ఎర్రన్న, దేవన్న, టి.కృష్ణగౌడ్, డి.బన్సీ, మార్క్స్, బాబురావు, శ్రీనివాస్‌రెడ్డి, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకుల అరుణ, సుప్రియ, వేల్పూర్ లక్ష్మి, ఐఎఫ్‌టీయూ నాయకులు సూర్య శివాజీ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- అర తులం బంగారం, 18 తులాల వెండి ఆభరణాలు చోరీ
- మరో రెండు ఇండ్ల తాళాలు పగులగొట్టిన దుండగులు


బీరువాను పరిశీలిస్తున్న పోలీస్ అధికారి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి దుండగులు తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. మరో రెండు ఇండ్ల తాళాలు పగులగొట్టి చోరీకి యత్నించారు. ఈ ఘటనకు సంబంధించి కమ్మర్‌పల్లి ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన కలాల శ్రీలేఖ కొంతకాలంగా హాసకొత్తూర్ గ్రామానికి వెళ్లే రోడ్డులో సిరిగిరి శ్రీనివాస్ ఇంట్లో కిరాయికి ఉంటున్నారు. ఈనెల 16న ఇంటికి తాళం వేసి శ్రీలేఖ తన తల్లి ఇంటికి నిర్మల్ జిల్లా ఖానాపూర్ వెళ్ళింది. బుధవారం ఉదయం వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా గుర్తుతెలియని దొంగలు తాళం పగులగొట్టి బీరువాను తెరచి చోరీకి పాల్పడ్డట్టు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. సమాచారం అందుకున్న ఎస్ఐ అనిల్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బీరువాలో పెట్టిన అర తుల బంగారం ఉంగరం, 18 తులాల వెండి ఆభరణాలు, కొంత నగదును చోరీకి గురైనట్లు శ్రీలేఖ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా పక్కనే ఉన్న సిరిగిరి శ్రీనివాస్, చింత గణేష్ ఇల్లు తాళాలను కూడా దుండగులు పగులగొట్టినట్లు ఎస్ఐ తెలిపారు. వారి ఇండ్లలో ఏం చోరీ జరగలేదని తెలిపారు. కాగా కలాల శ్రీలేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు. దొంగతనం జరిగిన ఇంటిని భీంగల్ సీఐ నవీన్ కుమార్ పరిశీలించారు. కేసు దర్యాప్తు వేగవంతం చేయాలని పోలీసులకు సూచించారు.

ఉపాధ్యాయులంతా కాంప్లెక్స్ సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలి: విద్యాశాఖ అధికారి


మాట్లాడుతున్న విద్యాశాఖ అధికారి

నవతెలంగాణ-బాల్కొండ

ఉపాధ్యాయులందరూ స్కూల్ కాంప్లెక్స్ సమావే శాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్ తెలిపారు. ఉపాధ్యా యులకు ఆయన బుధవా రం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులంతా బాధ్యతగా, అంకిత భావంతో పనిచేయాలని, ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులందరూ తరగతి గదిలో అనుసరించవలసిన బోధనా పద్ధతులను, బోధనోపకరణాలను తయారు చేసుకుని ప్రదర్శనగా ఉంచాలన్నారు. నూతన బోధనా పద్ధతులను, సాంకేతికతను ఉపయోగించి తమ వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి ఈ సమావేశాలు ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు ప్రణాళికా బద్ధంగా బోధించాలని, అందుకు అవసరమైన టీఎల్ఎం, లెసెన్‌ప్లాన్‌లు, వార్షిక ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకొని ఉత్తమ విద్యాబోధన ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులను తయారు చేయడంలో ఉపాధ్యాయులు కార్యోన్ముఖులు కావాలని మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్ సూచించారు. ప్రాథమిక పాఠశాలల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాల్కొండలో జరుగుతున్న ప్రాథమిక ఉన్నత పాఠశాల తెలుగు కాంప్లెక్స్ సమావేశాలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌నగర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర కుమార్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ కుమార్, రామస్వామి, శ్రీలక్ష్మి, నాగల రాజేందర్‌గౌడ్, కోకిల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ అభివృద్ధిపై దృష్టిపెట్టాలి

- నియోజకవర్గంలో సమస్యలను పరిష్కరించాలి
- అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

ఆర్మూర్ నియోజకవర్గ సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు. బుధవా రం అసెంబ్లీ సమావేశంలో ఆర్మూర్ నియోజకవర్గ సమస్యలపై ప్రస్తావిం చారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఎక్కువగా సంవత్సరకా లంగా ప్రభుత్వ పాఠశాలలో పర్యటి స్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో 193 స్కూల్స్ ఉంటే 125 స్కూ ల్స్‌లో బాత్రూంలు లేవన్నారు. డైట్ చార్జీలు 40శాతం, కాస్మోటిక్ చార్జీలు 200శాతం పెంచినందుకు ప్రభుత్వానికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ పాఠశాలను ప్రతిపక్ష ఎమ్మెల్యే అయిన తనకు ఇచ్చినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పదేండ్లు బంగారు తెలంగాణ పోయి వజ్రాల తెలంగాణ వచ్చినా.. డొంకేశ్వర్ మండలానికి జూనియర్ కళాశాల ఇంకా రాలేదన్నారు. 50 గ్రామాలకు కేంద్రంగా ఉన్న నందిపేట్ మండలానికి డిగ్రీ కళాశాల మంజూరు చేయాలన్నారు. ఇటీవల నియోజకవర్గంలో పర్యటన చేసినప్పుడు నూత్‌పల్లి, కుద్వాన్‌పూర్ వంటి హాస్టల్స్‌లో కనీస వసతులు లేవని, చిన్న కాంట్రాక్టర్లకు బిల్లులు రాక పనులు చేయడం లేదని తెలిపారు. విద్యావ్యవస్థలో చిన్న పొరపాట్ల వల్ల మొత్తం ఇబ్బంది అవుతుందని డొంకేశ్వర్ మండలానికి జూనియర్ కళాశాల, నందిపేట్‌కు డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని, అలాగే అంకాపూర్‌లో వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు 4 పంటలు ఎక్కువగా పండిస్తారని, అన్ని అర్హతలున్న గ్రామం అంకాపూర్ అని ఎమ్మెల్యే అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ అతిత్వరలో ఎమ్మెల్యే మాట్లాడిన వాటిపై నిధులు మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు.

'నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి'



నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామానికి చెందిన దెగ్లూర్ ప్రశాంత్ అనే యువకుడు ఇటీవల ఆర్టీవో డిపార్ట్‌మెంట్‌లో పోలీస్ ఉద్యోగం సాధించగా.. అదే గ్రామానికి చెందిన సిరిగిరి గోపాల్, సివిల్ పోలీస్ ఉద్యోగం సాధించారు. కాగా ఎడపల్లి మండల కేంద్రంలోని శ్రీ వాగ్దేవి పాఠశాల కరస్పాండెంట్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి మాజీ అధ్యక్షులు నార్ల కాశీనాథ్ గుప్తా నిజామాబాదులోని ఆర్టీవో ఆఫీస్ కార్యాలయంలో గ్రామానికి చెందిన దేగ్లూర్ ప్రశాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. నేటి యువతీయువకులు చిన్నవయసులోనే ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తున్న యువతను ఆదర్శంగా తీసుకోవాలని నార్ల కాశీనాథ్ గుప్తా కోరారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరికలు


కాంగ్రెస్‌లో చేరుతున్న పలువురు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

భీంగల్ మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ యూత్ టౌన్ ప్రెసిడెంట్ నీలం రవి, బీఆర్ఎస్ యూత్ నాయకులు నరేష్, రాజు, సీహెచ్ రాకేష్, బిట్టు, సురేష్, మహేష్, మజ్జు, అక్రం తదితరులు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నీలం రవి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలు మెచ్చిన పాలన ప్రజల ఆకాంక్ష మేరకు పరిపాలన జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బోదిరె స్వామి, టౌన్ అధ్యక్షుడు నర్సయ్య, కన్నె సురేందర్, మల్లెల లక్ష్మణ్, అనంతరావ్, విక్రమ్, సాయిబాబా, పల్లె శేఖర్, కోరాడి లింబాద్రి, పోల్సాని రంజిత్, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

పొరపాట్లకు తావివొద్దు

- సర్వే వివరాలను పక్కాగా నమోదు చేయాలి
- జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్



నవతెలంగాణ-బాల్కొండ

సర్వే నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం బాల్కొండ, చిట్టాపూర్ గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల ఆన్‌లైన్ నమోదు సర్వేను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. రోజువారీగా ఎన్ని కుటుంబాల వివరాలు నమోదు చేస్తున్నారు, సర్వే నమోదు వివరాలకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని సర్వే బృందాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దరఖాస్తుదారుల స్థలాల డాక్యుమెంట్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ అద్ప శ్రీధర్, ఎంపీఓ గంగ మోహన్, బాల్కొండ, చిట్టాపూర్ పంచాయతీ కార్యదర్శులు రజనీకాంత్‌రెడ్డి, సాయికృష్ణ, జూనియర్ అసిస్టెంట్ ప్రభాకర్, తదితరులున్నారు.

క్లాసికల్ డాన్స్‌లో రిద్ధికి అవార్డు

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌కు చెందిన రిద్ధి అనే విద్యార్థిని క్లాసికల్ డాన్స్ విభాగంలో అవార్డు అందుకుంది. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో గల బుల్లితెర అవార్డు ఫంక్షన్‌లో శిల్పకళ వేదికలో భాగంగా రిద్ధి క్లాసికల్ డాన్స్ విభాగంలో పాల్గొంది. విబి ఎంటర్‌టైన్‌మెంట్స్ బుల్లితెర అవార్డ్స్ (టీవీ ఆర్టిస్ట్ ఫంక్షన్) 2023-24లో అవకాశం రావడం విద్యార్థిని రిద్ధి నృత్యంలో తన ప్రతిభ కనబరిచినందుకుగాను అవార్డు దక్కింది. హైదరాబాదులో ముఖ్యులచే, సినీ ఆర్టిస్టులచే అవార్డును అందుకుంది. అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.



9 సెల్‌ఫోన్‌లు రికవరీ.. అప్పగింత


అందజేసిన సెల్‌ఫోన్లతో బాధితులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని 4వ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి బాధిత యజమానులకు అప్పగించినట్టు ఎస్ఐ శ్రీకాంత్ బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. సెల్‌ఫోన్స్ పోగొట్టుకున్న వారి ఫోన్స్‌ని సిఈఐఆర్ అప్లికేషన్ ద్వారా ట్రేస్ చేసి 9ఫోన్స్‌ను యజమానులకు అందజేసినటుట పేర్కొన్నారు.

శాంభవి హైస్కూల్‌లో యెల్లో డే


యెల్లో డేలో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని శాంభవి ఉన్నత పాఠశాలలో బుధవారం యెల్లో డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు యెల్లో దుస్తులు ధరించి ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో భాగంగా యెల్లో కలర్ కలిగి ఉన్న అరటి, నిమ్మ, జామ, బొప్పాయి పండ్లను, వాటితో పాటు పువ్వులను తీసుకువచ్చి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. పసుపు రంగు పిల్లలకు ఆనందం, శక్తి, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ బొట్ల మధుసూదన్ రాజు, కరస్పాండెంట్ బొట్ల రవీణ్ ప్రసాద్, ప్రిన్సిపాల్ బొట్ల ఇంద్రాణి, వైస్ ప్రిన్సిపాల్ బొట్ల మంజుల, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సినిమా సమాజానికి ఉపయోగపడాలి

- లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షులు జయప్రకాష్ నారాయణ
- 'దక్కన్ సర్కార్' సినిమా పోస్టర్ ఆవిష్కరణ


సినిమా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జయప్రకాశ్ నారాయణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

సినిమా అనేది సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని లోక్ సత్తా వ్యవస్థాపక అధ్యక్షులు జయ ప్రకాష్ నారాయణ అన్నారు. బుధవారం కళా ఆర్ట్స్ బ్యానర్‌లో కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వహించిన నిజామాబాద్ జిల్లాకు చెందిన కళా శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెరకెక్కుతున్న చిత్రం దక్కన్ సర్కార్ పోస్టర్‌ను లోక్ సత్తా వ్యవస్థాపక అధ్యక్షులు జయప్రకాష్ నారాయణ చేతుల మీదుగా సోమాజిగూడలోని ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ.. సినిమా ఎన్ని కోట్లు పెట్టి తీసామనేది ముఖ్యం కాదని అన్నారు. హీరోలు ఉంటేనే సినిమా కాదు.. సినిమా అనేది ఎల్లప్పుడు సామాజిక కోణాన్ని ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని తెలిపారు. ఈ సినిమా టీజర్ చూస్తుంటే నాకు అలానే అనిపిస్తుందని పేర్కొన్నారు. ఈ సినిమాను నిర్మించిన కళ శ్రీనివాస్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఎన్నో కోట్లు పెట్టి సినిమాలు తీయడం కాదని, కోట్లు లేకున్నా కంటెంట్ ఉంటే అది ప్రజలకు కనెక్ట్ అవుతుందని ఇందుకు దక్కన్ సర్కార్ సినిమాని చెప్పవచ్చని అన్నారు. ఈ సందర్భంగా నిర్మాత, దర్శకుడు కళా శ్రీనివాస్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంగీత దర్శకుడు మల్లిక్ ఎంవికే, కళా శ్రీనివాస్, చిత్ర హీరో చాణక్య, సామాజికవేత్త రంగనాయకుల సంతోష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హాసకొత్తూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బుస కృష్ణ కుమార్ బుధవారం తెలిపారు. ఇటీవల జరిగిన మండల స్థాయితో పాటు మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో హాసకొత్తూర్ పాఠశాలలో 8వ తరగతికి చెందిన ప్రతిభ, సంగీత, ఉదయ్ కుమార్‌లు అద్భుత ప్రతిభ కనబర్చారని ఆయన తెలిపారు. ఆ ముగ్గురిని సెలెక్టర్లు రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారని, వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో వారు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులు, శిక్షణ ఇచ్చిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మాధురిని అభినందించారు. రాష్ట్రస్థాయిలో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికవ్వాలని, తద్వారా పాఠశాలకు, గ్రామానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస మూర్తి, నరేందర్, షేక్ జాన్ పాషా, శ్రీనివాస్, దాసు, తదితరులు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్'ను అడ్డుకుంటారా..?

- ఎంపీడీవో కార్యాలయం ఎదుట కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా


ధర్నా చేస్తున్న కార్మికులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని అడ్డుకోవడాన్ని నిరసిస్తూ ఎంపీడీవో కార్యాలయం ముందు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టియుసిఐ జిల్లా నాయకులు మురళి, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు గంగాధర్, కారోబార్ల సంఘం అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ.. అర్ధరాత్రి నాయకులను, పంచాయతీ కార్మికులను అక్రమంగా అరెస్టు చేయడన్ని ఖండిస్తున్నామన్నారు. రేవంత్ సర్కార్ గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోగా కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఉద్యమిస్తుంటే అక్రమ అరెస్టు చేయడం సిగ్గుచేట న్నారు. ప్రజా పాలన, ప్రజాస్వామ్యమని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల పట్ల అత్యంత దుర్మార్గంగా వ్యవహరించడం సరైనది కాదని విమర్శించారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఒకవేళ కార్మికుడు మరణిస్తే దహన సంస్కారాలకు రూ.30 వేలు ఆర్థిక సహాయం అందించాలని తెలిపారు. రిటైర్మెంట్ బెనిఫిట్‌గా ప్రతి కార్మికుడికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనియెడల రానున్న రోజుల్లో గ్రామపంచాయతీ కార్మికులతో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రవి, పోశెట్టి, సంజు, సాయిలు, దుర్గ, రాజేశ్వర్, కృష్ణ, రమేష్, రవి, మహేష్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

మూడోరోజు ఆమరణ నిరాహార దీక్ష

- ఆమరణ దీక్షను భగ్నం చేసిన పోలీసులు..
- ప్రభుత్వాస్పత్రికి నాయకుల తరలింపు


దీక్ష భగ్నం చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

విద్య, వైద్యం, ఉపాధి, ఇల్లు, భూమి కోసం ధర్మ సమాజ్ పార్టీ పోరాటం చేస్తుందని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సుమన్ మహారాజ్, జిల్లా అధ్యక్షులు మహిపాల్ మహారాజ్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష 3వ రోజుకు చేరుకుంది. దీక్ష చేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ సుమన్ మహారాజ్, మహిపాల్ మహారాజ్ హెల్త్ చెకప్ బిపి, షుగర్ లేవల్స్‌ను వైద్యులు పరీక్షించినట్టు సంబంధిత నిరాహార దీక్ష సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యంను అందించాలన్నారు. ప్రజలందరికీ వారి వారి అర్హతలను బట్టి ఉపాధి అందించాలని తెలిపారు. అర్హులైన వారందరికీ సాగునీటి సౌకర్యంతో పాటు ఒక ఎకరం వ్యవసాయ భూమిని ఇవ్వాలన్నారు. అర్హులైన వారందరికీ 200 గజాల స్థలంలో నాలుగదుల ఇల్లును నిర్మించి ఇవ్వాలని తెలిపారు. ఈ డిమాండ్స్‌ని గత నెల రోజుల నుంచి ప్రభుత్వం ముందు ఉంచుతూ సోమవారం నుంచి ఆమరణ నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ప్రేమ్, జిల్లా నాయకులు మురళి, ప్రశాంత్, శుభాష్, మైపాల్, కిషన్, ఉమేష్, మహేష్, నిశాంత్, గంగాధర్, మహేష్, ఆత్మగౌరవ్, బాలన్న వివిధ ప్రజా సంఘాల నాయకులు, మద్దతుగా పాల్గొన్నారు.

ఆమరణ దీక్షను భగ్నం చేసిన పోలీసులు..

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా కొనసాగుతున్న ఆమరణ దీక్షను పోలీసులు బుధవారం రాత్రి భగ్నం చేశారు. ఆమరణ దీక్ష చేస్తున్న సుమన్ మహారాజ్, మహిపాల్ మహారాజ్‌ను బలవంతంగా ఆసుపత్రికి తరలించారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు



నవతెలంగాణ-ఎడపల్లి

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన లింగం అనే వ్యక్తి మంగళవారం సాయంత్రం బైక్‌పై రెంజల్ మండలం సాటాపూర్ గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో మండల పరిధిలో గల అంబేద్కర్ కాలనీ వద్ద బైక్ అదుపుతప్పడంతో ఆయన కింద పడిపోయాడు. దీంతో కన్ను, ఇతర చోట్ల గాయాలయ్యాయి. స్థానికులు గమనించి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రస్తుతం లింగం చికిత్స పొందుతున్నట్టు ఆయన కుటుంబీకులు తెలిపారు.

మంచినీటి సమస్య పరిష్కారం


మరమ్మతులు చేపడుతున్న అధికారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని నాగారం ప్రాంతంలో గల రాజీవ్ గృహకల్ప అపార్ట్‌మెంట్ మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు బుధవారం మున్సిపల్ అధికారులు విచ్చేశారు. స్థానిక అధికారి ఏఈ సల్మాన్, స్థానిక ఎలక్ట్రికల్ ఇంచార్జి జుబేద్ వచ్చి మంచినీటి బోరును పరిశీలించి దానికి సంబంధించిన ఇన్స్ట్రుమెంట్‌పై అధికారులకు పంపించి ఆర్‌జికే అపార్ట్మెంట్స్‌లో ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించారు. ఈ విషయంలో గత నెలలో ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత మాట్లాడుతూ.. మున్సిపల్ కమిషనర్‌కి, ఈఈ, ఏఈ సల్మాన్‌కి, స్థానిక ఎలక్ట్రికల్ ఇంచార్జ్ జుబేద్‌కి ప్రత్యేకమైన అభినందనలు తెలిపారు. ఆర్‌జికే అపార్ట్మెంట్స్ జనరల్ సెక్రెటరీ పవర్ కృష్ణ, కమిటీ సభ్యులు క్యాషర్ వేణు గోపాల్, బస్తీ వాసులు ధన్యవాదాలు తెలియజేశారు.

గడుగు గంగాధర్‌కు సన్మానం

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులుగా ఎన్నికైన గడుగు గంగాధర్‌కు జిల్లా యోగ అసోసియేషన్ ప్రభాకర్ ఆధ్వర్యంలో బుధవారం పుష్ప గుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యోగ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ తోట లింగం వర్ధంతి

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని ఏఆర్‌పి క్యాంప్ గ్రామ తొలి మాజీ సర్పంచ్ తోట లింగం 15వ వర్ధంతిని కుటుంబ సభ్యులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తోట లింగం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఆర్పి క్యాంప్ గ్రామ పెద్దలు మాట్లాడారు. ఏఆర్‌పి గ్రామ తొలి సర్పంచిగా తోటలింగం ఎన్నికై గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని స్థానికులు కొనియాడారు.

భాషపై మమకారం పొందేలా

మెళుకువలను నేర్పించే బాధ్యత అధ్యాపకులదే

- వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ యాదగిరి రావు


మాట్లాడుతున్న వైస్ ఛాన్సలర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

విద్యార్థుల్లో పుస్తక పట్టణ అభిలాష సృజనాత్మకమైన రచనలు రాసే విధానం, భాషపై మమకారం పొందేలా మెళుకువలను నేర్పించే బాధ్యత అధ్యాపకులకుల మీద ఎంతైనా ఉందని తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.యాదగిరిరావు అన్నారు. బుధవారం తెలంగాణ యూనివర్సిటీ తెలుగు విభాగ ఆధ్వర్యంలో సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా లాంగ్వేజెస్ (భారతీయ భాషా విభాగ సంస్థ), ఉన్నత విద్యా మండలి సంయుక్తంగా తెలుగు అధ్యాపకుల పున:శిక్షణ తరగతులను బుధవారం నుంచి 24 వరకు ఆరు రోజుల కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమ ప్రారంభ కార్యక్రమాన్ని తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి యాదగిరి రావు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ.. తెలుగు భాషలోని పోతన పద్యాన్ని చక్కగా ప్రస్తావించారు. తెలుగు భాష మాట్లాడుతున్నప్పుడు ముఖ యంత్రంలోని కదలికలను గురించి చక్కని ఉదాహరణతో తెలిపారు. విద్యార్థుల్లో పుస్తక పట్టణ అభిలాష సృజనాత్మకమైన రచనలు రాసే విధానం భాషపై మమకారం పొందేలా మెలకువలను నేర్పించే బాధ్యత అధ్యాపకులకుల మీద ఎంతైనా ఉందని చెప్పారు. గిడుగు రామ్మూర్తి, సురవరం సాహిత్యాలను కొనియాడారు. భాషా పద్యాలు తెలుగు భాషను భావితరాలకు అందించేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, అందుకు ఈ ఓరియంటేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇలాంటి మహోన్నత కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టినందుకు వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ లావణ్యను అభినందించారు. ప్రొఫెసర్ కాశిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ఆది మానవుని కాలంలో నాటి నుంచి నేటికీ భాష పరిణామం చెందిందో వివిధ భాష పదాల ద్వారా తెలియజేశారు. నాడు భాష మౌఖీకంగా ఆవిర్భావం కాగా నేడు అనేక ప్రక్రియలో వికాసం చెందిన పేరును వివిధ కావ్యాలలోని పద్యాలను అలవోకగా పారుతూ పారుతూ ఈ సభకు మకుటాయమానంగా నిలిచారు. తెలుగు భాషను పకృతితో జోడించి విద్యార్థుల్లో వైజ్ఞానిక అంశాలను తెలుసుకునే విధంగా ప్రేరణ పొందేలా ఆకర్షణీయంగా పాఠ్యాంశాలను బోధించాలని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆరతి మాట్లాడుతూ.. తెలుగు భాషకు సాంకేతికతను జోడిస్తే ప్రపంచంలోనే ఎక్కడి వారికైనా తెలుగు బోధించే నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమా నిర్వాహకురాలు ప్రొఫెసర్ లావణ్య మాట్లాడుతూ భారతీయ భాషల విభాగాల సంస్థ వారు తెలంగాణ యూనివర్సిటీ తెలుగు విభాగానికి ఈ అవకాశం ఇవ్వడం చాలా ఆనందకరమైందని తెలిపారు. తెలుగు అధ్యాపకులు పరిశోధక విద్యార్థులుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని ఆనందం వ్యక్తం చేశారు. సాహిత్య మెలకువలు తమలో ఏ విధంగా సృజనాత్మకమైన ఇలా పెంపొందించుకోవాలో నేర్చుకోవడానికి చక్కని అవకాశమని లావణ్య వివరించారు. ఈ కార్యక్రమానికి సిఐఐఎల్ సంస్థ కార్యదర్శి వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.